క్లుప్తంగా

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

గుడిపాల: మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. గతంలో జరిగిన రీ సర్వేలో ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకోవడానికి రీ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా 22వ తేదీన ముటుకూరుపల్లె, 23న పాపసముద్రం, 24న డీబీపల్లె, 25న వసంతాపురం, 26న క్రిష్ణజమ్మాపురం, 29న బందార్లపల్లె, 30న పశుమంద, నవంబర్ 5వ తేదీన చిత్తపార, 6న కుప్పిగానిపల్లె, 7న నంగమంగళం, 8న మరకాలకుప్పం, 12న మొగరాళ్లపల్లె, 13న లక్ష్మాంబపురం రెవెన్యూలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఔట్ రీచ్ వర్కర్ లక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్: ఎయిడ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి అవసరమని కోర్ ఎన్జీఓ ఔట్ రీచ్ వర్కర్ లక్ష్మీ అన్నారు. సంతపేటలోని శ్రీసాయి ఐటీఐలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్, టీబీ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. ఎయిడ్స్‌కు మందులేదని, నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ సద్దాం, ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

మొగిలీశ్వరాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం రాహుకాల సమయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకుని మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

సకాలంలో వినతుల పరిష్కారం



వినతి స్వీకరిస్తున్న సహాయ కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) ద్వారా అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా అందే వినతులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని ససూచించారు. పూర్తిస్థాయి విచారణ నివేదికలను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో మొత్తం ఇంజినీరింగ్ -4, టీపీవో -1, రెవెన్యూ -1, అకౌంట్స్ -1 చొప్పున మొత్తం 7 వినతులు అందాయి. కార్యక్రమంలో విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- వర్షాలకు నేలకొరిగిన వరి పంట
- నష్టాల పాలైన మండల రైతాంగం
- ఆరు రోజులు దంచికొట్టిన వాన
- మండలంలో 268 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు
- అయినా నిండని చెరువులు





ప్రకృతి ప్రకోపం.. అన్నదాతకు శాపం

పొలంలో నిలిచిన నీటిలోనే వరి పంటను కోస్తున్న కూలీలు, (ఇన్ సెట్) ఇరువారంపల్లెలో నేలకొరిగిన వరిపంట

ఐరాల: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మండల వ్యాప్తంగా ఆరు రోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. దీంతో చాలా చోట్ల ఆరుతడి పంటలు నీట మునిగాయి. ఈ ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు బోర్ల కింద సాగు చేసి, కోత దశకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. ఈ వర్షాల కారణంగా 35 యర్లంపల్లెకు చెందిన రైతులు నిలువునా అప్పుల్లో కూరుకుపోయారు. పంట చేతి కంది ఒకటి, రెండు రోజుల్లో ఇంటికి వస్తుందన్న తరుణంలో వాయుగుండం రూపంలో వరి రైతులను ముంచేసింది. ఈ ఏడాది బోర్ల కింద ముందుగానే వరిపంటను సాగు చేశారు. రైతులు ఐదు నెలల పాటు కష్టపడినా ఫలితం లేకుండా పోయింది. రైతులు పంటలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. కొంతమంది వరి పొలాల్లో నిలిచిన వర్షపు నీటిలోనే కూలీలతో కోతలు ప్రారంభించారు. మరి కొంత మంది వరి పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపే పనుల్లో నిమగ్నమయ్యారు. వరి పంట నేలపాలు కావడంతో ఇప్పటికే మొలకలు వచ్చి పనికిరాకుండా పోయింది. 35 యర్లంపల్లెలో చాలా మంది రైతులు వరి పంట వలన తీవ్రంగా నష్టపోయారు. సాగు కోసం పెట్టిన ఖర్చులన్నీ బూడిదలో పోసినట్లు అయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటి పూట భానుడి తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రాత్రి సమయంలో ఒక్క సారిగా వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. వర్షం తగ్గినా వరికోత కోసం దుకు కోత యంత్రాలు, ట్రాక్టర్లు పొలాల్లో దిగబడి పోతున్నాయి. దీంతో ఆ యంత్రాలను వినియోగించే పరిస్థితి కూడా లేదు. ఉన్న పంట దక్కుతుందా లేదా అన్న సందేహంలో రైతులు ఉన్నారు. మండలంలో ఉద్యాన పంటలు 30 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ వర్షానికి పొలాల్లో నీరు నిలిచి చీడ పీడలు ఆశించే పరిస్థితి ఎదురవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

268 మిల్లీమీటర్ల వర్షపాతం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో అత్యధికంగా 268 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా రైతులు 1113 హెక్టార్లల్లో వ్యవసాయ పంటలు సాగు చేశారు. ఈ వర్షాలకు పంటలు పూర్తిగా నీటి మునిగిపోయాయి. పల్లెలకు వెళ్లే దారులు బురదమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మళ్లీ వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు జారీ చేయడంతో అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మండలంలో రైతులు 127 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట దశలో కొంత పంట ఉండగా, కోతలకు చేరిన వరి పంట అధికంగా ఉంది. దీంతో కురిసిన వర్షపు నీరంతా భూమిలోకి ఇంకిపోకుండా నిల్వ ఉండడడంపై రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

ధరలు తగ్గుతాయేమోనని ఆందోళన

ఎకరా భూమిలో వరి పంట సాగుకు రూ.30వేల నుంచి రూ.40 వేల దాకా ఖర్చు పెట్టారు. పంట ఆశించిన స్థాయిలో ఎదిగి చేతి కొచ్చింది. ఇక ఇంటి కొచ్చే సమయంలో తుపాను దెబ్బతీసింది. వరుసగా కురిసిన వర్షాలతో వరి పంటలు తడిచి దెబ్బ తిన్నాయి. దీంతో ధాన్యం ధరలు తగ్గుతాయేమోనని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం క్వింటాల్ నాణ్యతను బట్టి రూ.2,320 ధర ఉందని ఏఓ వరలక్ష్మి తెలిపారు. అయితే ఈ వర్షానికి తడవడంతో రేటు తగ్గిస్తారేమోనని వారు ఆవేదన చెందుతున్నారు. ఏది ఏమైనా ఈ వర్షం వరి రైతులకు తీరని నష్టం కలిగించింది.

నిండని చెరువులు

మండలంలో 143 చెరువులు ఉన్నాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అరకొరగా చెరువులోకి నీరు చేరుతోంది. చుక్కావారిపల్లె చెరువు నిండినట్లు ఇరిగేషన్ ఏఈ తెలిపారు. మిగిలిన చెరువులకు వర్షపు నీరు చేరక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయకట్టు పొలాలు బీడుగా మారాయి. ప్రస్తుతం పొలాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పంటలు సాగు చేయాలన్నా పొలాలను పూర్వ స్థితికి తీసుకొచ్చేందుకు తమకు భారీగా ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు.



నీరు లేని వీఎస్.అగ్రహారం చెరువు

మొలకలు వచ్చాయి

ఎకరా పొలం వరి సాగు చేశాను. ఆరుగాలం కష్టించి పంటలను కాపాడుకున్నా. తీరా రెండు రోజుల్లో పంట చేతికొస్తుందనగా ప్రకృతి ప్రకోపం చూపింది. పంట పండి చేతికివచ్చే సమయంలో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలు తీవ్రంగా నష్టపోయాం. ఎకరా వరి పంట నీటిలో మునిగిపోవడంతో మొలకలు వచ్చి పనికిరాకుండా పోయింది. సాగు పెట్టుబడికి రూ.50 వేలు కాగా ఇప్పుడు వర్షపు నీటిలో ఉన్న వరి పంట కోయడానికి కూలీలు ఖర్చు రూ.70 వేలు అవుతుంది. పెట్టుబడి అయినా దక్కుతుందని అనుకుంటే అప్పులు మిగిలాయి. వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

–హేమంత్‌రెడ్డి, రైతు, 35 యర్లంపల్లె, ఐరాల



డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం నాగరత్న

తవణంపల్లె: డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏపీఎం నాగరత్న కోరారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు రేఖ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఏపీఎం నాగరత్న మాట్లాడుతూ గ్రామ సమాఖ్యల పనితీరు గురించి సమీక్షించి సూచనలిచ్చారు. స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నత బ్యాంకు రుణాలు మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీసీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల గురించి డ్వాక్రా సభ్యులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అర్హులైన ఉత్సాహవంతులైన సభ్యులకు బ్యాంకు అధికారులతో మాట్లాడి మంజూరు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కార్యదర్శి అనిత, సీసీలు, అకౌంటెంట్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రాజగోపాల్ నాయుడికి నివాళి

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘం రాజన్న పార్కులో దివంగత మాజీ ఎంపీ రాజగోపాల్‌నాయుడు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు, అమర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమాదేవి దివంగత మాజీ ఎంపీ రాజగోపాల్‌నాయుడు విగ్రహానికి పూజలు చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



టోల్‌ప్లాజా వద్ద వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: వాహనదారులు రహదారి నింబంధనలు పాటించాలని బంగారుపాళెం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద సోమవారం సాయంత్రం వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ విధిగా ధరించాలని సూచించారు. నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాల తీవ్రత తక్కువగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ద్విచక్ర వాహనదారులే ప్రమాదాల బారిన పడుతుంటారన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించండి

పూతలపట్టు: మండలంలోని గ్రామాల్లో నీటి సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ నాగరాజు ఆదేశించారు. మండల కేంద్రంలోని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అధిక శాతం కరెంట్ సమస్యలున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, రోడ్లకు గుంతలను గమనించి వాటిని సరి చేయాలని అధికారులను ఆదేశించారు. తొలి ప్రాధాన్యతగా పారిశుధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యం



పానాటూరులో సేవలు అందిస్తున్న వైద్యులు

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో గర్భిణులకు ఇంటివద్దకే మెరుగైన వైద్యం వస్తుందని వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని పానాటూరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 55 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే వైద్యసేవలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శాంతకుమారి, శివగామి, మనిమేఘల, వీరలక్ష్మి పాల్గొన్నారు.



చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై నిల్వ ఉన్న వర్షపునీరు

రహదారి జలమయం

గుడిపాల: వర్షం కురిస్తే చెన్నై–బెంగుళూరు జాతీయ రహదారి జలమయమైపోతుంది. మండలంలో నరహరిపేట, గుడిపాల క్రాస్ వద్ద రోడ్డుపైనే వర్షపు నీరు నిలిచిపోతోంది.బస్సులు, లారీలు వేగంగా వెళ్తున్నప్పుడు అదే సమయంలో ద్విచక్ర వాహనదారులు అటువైపు వెళ్తుండగా ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి, ఆ నీటిని తొలగించాలి.

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామాల్లో ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఎగువ వెంకటాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే ఇంటింటికీ తిరిగి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని, కాచి చలార్చిన నీరు తాగాలని పేర్కొన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పకుండా వాడాలని వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం 30 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎస్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కాంస్య పతకం సాధించిన ఐరాల విద్యార్థి



కాంస్య పతకం సాధించిన విద్యార్థితో హెచ్ఎం, పీడీ

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు ఆ పాఠశాల హెచ్ఎం కోమల తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ నంద్యాలలోని గురురాజ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి రోహిత్ ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొని మంచి ప్రతిభ కనబరచి మూడవ స్థానం సాధించి కాంస్య పతకం గెలుపొందాడని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో పతకం సాధించిన రోహిత్‌ను చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, కార్యదర్శి రమేష్ అభినందించి, జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. రోహిత్, పీడీ దేవాలను ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్యాస్ ఏజెన్సీల దోపిడీ



- ఒక్కో సిలిండర్‌పై రూ.50 నుంచి రూ.100 అదనపు గుంజుడు
- రెండు నియోజకవర్గాల్లో నెలకు దోపిడీ రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల పైమాటే..!

ప్రభుత్వం తరచూ గ్యాస్ సిలిండర్ రేట్లను పెంచుతూ వినియోగదారులకు ఓ వైపు వాతలు పెడుతూంటే, మరోవైపు తామేమీ తక్కువ కాదని గ్యాస్ ఏజెన్సీలు సైతం అదే బాట పట్టాయి. ప్రతి సిలిండర్‌కు రూ.50 నుంచి రూ.100 వరకు గుంజుతున్నాయి. వాస్తవానికి నిర్ణీత దూరం వరకూ ఉచితంగానే సిలిండర్లు సరఫరా చేయాలి. వినియోగదారులు చెల్లించే బిల్లులోనే ఇందుకు సంబంధించిన చార్జీలు కూడా కలిపి ఉంటాయి. కానీ, ఏజెన్సీల నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇందుకు డెలివరీ బాయ్‌లను ఉసిగొల్పుతున్నారు. ఎవరైనా ఇదేమని ప్రశ్నిస్తే సిలిండర్ల సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకుల అక్రమ దోపిడీతో వినియోగదారులపై ఏటా కోట్లాది రూపాయలు అదనపు భారం పడుతోంది. ఎల్‌పీజీ సిలిండర్లను వినియోగదారులకు సరఫరా చేయడం మూలాన సంబంధిత చమురు సంస్థల నుంచి గ్యాస్ ఏజెన్సీలకు కమీషన్ వస్తుంది. వినియోగదారుడు చెల్లించే మొత్తంలో సిలిండర్ సరఫరాకు సంబంధించిన రుసుము కూడా అంతర్లీనంగా ఉంటుంది. ఇంటికే సిలిండర్ తెచ్చి ఇవ్వాల్సిన గ్యాస్ ఏజెన్సీలు మధ్యలో డెలివరీ బాయ్స్ రూపంలో ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నాయి. ఈ విషయంపై ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో వారిదే ఇష్టారాజ్యంగా మారింది.

ధరల పెంపుతో చితక్కొట్టుడు

కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు తోడు జీఎస్టీ బాదుడు, చమురు ధరల పెంపు, ఎల్పీజీ గ్యాస్ మంట.. ఇలా తరచూ ధరల పెరుగుదల మూలాన సామాన్య, మధ్యతరగతి ప్రజలు చితికిపోతున్నారు. చిన్న కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి.

గ్యాస్ ఏజెన్సీల అత్యాశ..

వాస్తవానికి నిబంధనల ప్రకారం నిర్ణీత దూరం వరకు సిలిండర్లను ఫ్రీగానే డెలివరీ చేయాలి. నిర్దేశిత దూరం మించితే నిర్ణీత మొత్తంలోనే డబ్బులు తీసుకోవాలి. కానీ కిలోమీటర్ దూరం కూడా లేనిచోట కూడా ఒక్కో సిలిండర్‌పై రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. మరింత దూరం, భవన అంతస్తు బట్టి లెక్క కట్టి రూ.100 వరకు గుంజుతున్నారు. గ్యాస్ ఏజెన్సీకి కూత వేటు దూరంలోనే గృహాలు ఉన్నా దోపిడీ పర్వం కొనసాగుతోంది. పట్టణాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఏడాది క్రితం వరకు రూ.30 వరకు ముక్కు పిండి వసూలు చేసిన ఏజెన్సీలు ఇప్పుడు రూ.50కి పెంచి దోపిడీ చేస్తున్నాయి. అదనంగా ఎందుకు ఇవ్వాలని ఎవరైనా ప్రశ్నిస్తే ఆ వినియోగదారుల వివరాలను నోట్ చేసుకుని ఆలస్యంగా పంపిణీ చేయడం, లేదంటే లేనిపోని సాకులు చెప్పి ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారింది.

డెలివరీ దోపిడీ ఏటా రూ. కోట్లల్లో..

చిత్తూరు,పూతలపట్టు నియోజకవర్గాల్లో 1,64,819 వినియోగదారులుండగా, వీరికి రోజూ రెండు వేల పైచిలుకు సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. నెలకు సగటున 60 వేలకు పైగా సిలిండర్లు విక్రయిస్తున్నారు. అదనపు డబ్బులు చెల్లించనిదే సిలిండర్ ఇంటికే రాదు. ఈ లెక్కన రూ.50 చొప్పున లెక్కిస్తే అక్షరాలా నెలకు రూ. 30 లక్షలు అవుతోంది. ఏడాదికి లెక్కిస్తే రూ.3.6కోట్లు అవుతున్నదంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

చర్యలు తప్పవు

వినియోగదారుల ఇంటికి సిలిండర్లను తెచ్చి ఇవ్వాల్సిన బాధ్యత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులదే. నిర్ణీత దూరం దాటిన సందర్భంలోనే చమురు సంస్థల నిబంధనల మేరకు డబ్బులు తీసుకోవాలి. వినియోగదారులెవరైనా ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటే చమురు సంస్థల టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే పౌరసరఫరాల శాఖకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. డెలివరీ బాయ్స్ వసూళ్లకు పాల్పడితే ఏజెన్సీ నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– శంకరన్, డీఎస్ఓ, చిత్తూరు

